సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం । 22 । సెప్టెంబర్ । 2023



అన్నదానానికి విరాళం

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని నిత్యాన్న దాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన ఎస్.రామలక్ష్మి గురువారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



ఎలుకల దాడికి చెక్

వ్యవసాయ, ఉద్యాన పంటలకు ఎలుకల బెడదతో తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ముఖ్యంగా వరిపై ఖరీఫ్, రబీ సీజన్‌లలో ఎలుకలు దాడి చేసి నష్టపరుస్తున్నాయి. - 8లో▸

మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం 3,25,754 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. అలాగే తూర్పు డెల్టాకు 4,400, మధ్య డెల్టాకు 2,200, పశ్చిమ డెల్టాకు 7 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. భద్రాచలం వద్ద 21.40, కాటన్ బ్యారేజీ వద్ద 9.90 అడుగులకు నీటిమట్టం చేరింది.

న్యూస్‌రీల్

ఒకటిన బేసిక్ ఫస్ట్ ఎయిడ్‌పై శిక్షణ

సాక్షి అమలాపురం: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అమలాపురం విభాగం అక్టోబర్ ఒకటో తేదీన బేసిక్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ మాన్యువల్ కార్యక్రమం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తామని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పీఎస్ శర్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్టోబర్ ఒకటో తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశామన్నారు. శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రాలు అందిస్తామన్నారు. శిక్షణలో పాల్గొనేవారు ఈ నెల 28వ తేదీలోపు శిక్షణ రుసుం రూ.900 చెల్లించి పేరును నమోదు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు సెల్ నంబర్ 94401 18712లో సంప్రదించాలని శర్మ కోరారు.

ఐసీడీఎస్ కార్యాలయంలో పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ముమ్మిడివరం: జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయంలో కాంట్రాక్టు ప్రాతిపదికన పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా అధికారి జీవీ సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కోఆర్డినేట ర్ (ఓసీ కేటగిరి), ప్రాజెక్టు అసిస్టెంట్ (ఓసీ కేటగి రి), బ్లాక్ కోఆర్డినేటర్ (ఓసీ కేటగిరి) పోస్టుల కో సం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు కాంట్రాక్టు పద్ధతిపై ఒక సంవత్సరం కాలపరిమితితో పోస్టులు భర్తీ చేస్తామన్నారు. ఆసక్తిగల అ భ్యర్థులు డిస్ట్రిక్ట్ వెబ్ సైట్‌లో దరఖాస్తులు అప్ లోడ్ చేసుకోవాలని సూచించారు. అప్‌లోడ్ చేసిన ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలు ఈ నెల 29లోగా జి ల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, సాధికారత అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

పి.గన్నవరంలో నేడు జగనన్నకు చెబుదాం

సాక్షి అమలాపురం: మండల స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జగనన్నకు చెబుదాం కార్యక్రమం శుక్రవారం పి.గన్నవరం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా గురువారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందని జిల్లాస్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. మండల పరిధిలోని అర్జీదారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడిగా అశోక్



సాక్షి అమలాపురం: అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడిగా అమలాపురం మండలం పేరూరు గ్రామానికి చెందిన న్యాయవాది కుడుపూడి అశోక్‌ను నియమించారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, సీఎం జగన్‌మోహన్ రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో జిల్లా వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ కార్యవర్గాన్ని విస్తరణ చేయనున్నారు. అశోక్ వైఎస్సార్ సీపీ ప్రారంభం నుంచి పార్టీకి సేవలు అందిస్తున్నారు. ఆయన ఎంపిక పట్ల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌తో పాటు ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

చట్టసభల్లో పట్టాభిషేకం



- మహిళా రిజర్వేషన్ బిల్లుపై సర్వత్రా హర్షాతిరేకం
- పెరగనున్న మహిళల ప్రాతినిధ్యం
- ఇప్పటివరకూ తక్కువ సంఖ్యలో ఎన్నిక
- ఇప్పటికే జగన్ హయాంలో మహిళా సాధికారతకు అగ్రాసనం

(డెస్క్‌– రాజమహేంద్రవరం)

మహిళా సాధికారతకు ముందడుగు పడింది. చట్టసభల్లో వారి గళం బలంగా వినిపించే అవకాశం రానుంది. అన్ని రంగాల్లోనూ ముందంజ వేస్తున్నా ఈ సభల్లో కాలు మోపడం మహిళకు ఇన్నాళ్లూ కష్టతరమవుతోంది. మొక్కుబడి ప్రాతినిధ్యమే లభిస్తోంది. ఎన్నికలు జరిగిన ప్రతి సందర్భంలోనూ మహిళల సంఖ్య తక్కువగానే ఉంటోంది. రానున్న ఎన్నికలు మినహాయిస్తే ఇక వచ్చే ప్రతి ఎన్నికల్లోనూ 33 శాతం మహిళలు అసెంబ్లీ.. లోక్‌సభకు ఎన్నిక కానున్నారు. వీరికి ఈ మేరకు రిజర్వేషన్లు కల్పించేందుకు ఇప్పటికే మహిళా బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. అన్ని రాజకీయ పక్షాలు సానుకూలంగా ఉండటంతో ఈసారి బిల్లుకు ఎలాంటి ఆటంకాలు ఎదురుకావనే గట్టి ధీమా వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి మహిళలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం వివరాలను పరికిస్తే..

తొలినాళ్ల నుంచి పలుచనే..

2019 ఎన్నికలను మినహాయిస్తే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పలుచగా ఉంటోంది. 1983 నుంచి ఇప్పటి వరకూ తొమ్మిదిసార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్ని పరిశీలిస్తే ఇది స్పష్టమవుతుంది. రాష్ట్రంలోనే పెద్ద జిల్లాగా గుర్తింపు పొందినా ఇప్పటివరకూ 11 మంది మహిళలు మాత్రమే అసెంబ్లీలో అడుగుపెట్టారు. **మూడు ఎన్నికల్లో ఒక్క అతివకూ అవకాశం దక్కలేదు. ఎన్టీఆర్ ప్రభంజనం సృష్టించిన 1983 ఎన్నికల్లో మన జిల్లా నుంచి ఒక్క స్థానం నుంచి మాత్రమే మహిళ అసెంబ్లీలో అడుగుపెట్టగలిగారు. ముమ్మిడి**వరం నుంచి పోటీచేసిన వల్లాటి రాజ సక్కుబాయి గెలిచారు. తుని నుంచి కాంగ్రెస్ పక్షాన పోటీ చేసిన మాజీ మంత్రి ఎంఎస్ విజయలక్ష్మి దేవి ఈ ఎన్నికల్లో ఎన్టీఆర్ గాలిలో పరాజయం పొందారు. తర్వాత రెండేళ్లకే ఎన్నికలు వచ్చాయి. 1985లో జరిగిన ఈ ఎన్నికల్లోనూ ఒక్కరికీ అవకాశం దక్కలేదు. తెలుగుదేశం నుంచి కాంగ్రెస్ అధికార పగ్గాలు దక్కించుకున్న 1989 ఎన్నికల్లోనూ మహిళలకు ఛాన్స్ దక్కలేదు. తరువాత 1994 ఎన్నికల్లోనూ ఇదే తీరు పునరావృతమైంది. 1999 ఎన్నికల్లో మాత్రం ముగ్గురు మహిళలు జిల్లా నుంచి తొలిసారి ఎన్నికయ్యారు. పర్వత బాపనమ్మ (ప్రత్తిపాడు), పిల్లి అనంతలక్ష్మి (సంపర), చిల్లా జగదీశ్వరి (అల్లవరం) గెలిచారు. ఈ ఒక్క సందర్భంలో ముగ్గురు ఎన్నికయ్యే అవకాశం వచ్చింది. వైఎస్సార్ సారథ్యంలో కాంగ్రెస్ అధికారం పొందిన 2004 ఎన్నికల్లో నగరం నియోజకవర్గం నుంచి పాముల రాజేశ్వరీదేవి విజయం సాధించారు. తర్వాత 2009లో వంగా గీత(పిఠాపురం), పాముల రాజేశ్వరీదేవి(గన్నవరం) గెలుపొందారు. 2014 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున రంపచోడవరం నుంచి వంతల రాజేశ్వరి ఎన్నికయ్యారు. పి. అనంతలక్ష్మి కాకినాడ రూరల్ నుంచి ప్రాతినిధ్యం వహించారు.



జగన్ అదే మాట..అదే బాట

మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలిరోజు నుంచి కట్టుబడి ఉండటంతో వైఎస్సార్ సీపీ తరఫున మహిళలకు పెద్ద పీట వేస్తున్నారు. అసెంబ్లీ, లోక్‌సభల్లోనే కాదు కార్పొరేషన్ల పదవుల్లోనూ సింహభాగం స్త్రీలకు కేటాయించారు. వీరు సగర్వంగా తలెత్తుకునేలా, ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు కూడా దక్కేలా చూస్తున్నారు. జిల్లాల విభజనకు మునుపు 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఇద్దరు మహిళలు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. రంపచోడవరం (ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా) నుంచి నాగులపల్లి ధనలక్ష్మి, వైఎస్సార్ సీపీ పక్షాన ఎన్నికయ్యారు. రాజమహేంద్రవరం అర్బన్ నుంచి ఆదిరెడ్డి భవానీ ఎన్నికయ్యారు. గతేడాది విభజన తర్వాత ఆవిర్భవించిన తూర్పుగోదావరి జిల్లాలో కొత్తగా కొవ్వూరు చేరింది. ఈ నియోజకవర్గం నుంచి గెలిచిన తానేటి వనిత హోం మంత్రిగా కొనసాగుతున్నారు.

ఎంపీలు నలుగురే..

1952 నుంచి ఇప్పటి వరకూ నలుగురు మహిళలు జిల్లా నుంచి లోక్‌సభలో అడుగుపెట్టారు. అలనాటి సినీ నటి జమున(1989–1991) రాజమండ్రి లోక్‌సభ స్థానం నుంచి గెలుపొందారు. స్పీకర్ జీఎంసీ బాలయోగి అకాల మరణం తరువాత ఆయన సతీమణి గంటి విజయకుమారి (2002–2004) అమలాపురానికి ప్రాతినిధ్యం వహించారు. బాలయోగి మరణం దష్ట్యా అన్ని పార్టీలు సహకరించడంతో ఈమెకు పెద్దగా పోటీ ఎదురుకాలేదు. 15 ఏళ్ల తర్వాత మళ్లీ 2019లో మహిళలు లోక్‌సభలో అడుగుపెట్టారు. వైఎస్సార్ సీపీ తరఫున వంగా గీత కాకినాడ నుంచి.. చింతా అనురాధ అమలాపురం నుంచి గెలిచారు. ఇద్దరు మహిళలు జిల్లా నుంచి ఎన్నిక కావడం తొలిసారి కావడం విశేషం. లోక్‌సభలో పలు అంశాలపై గళం విప్పుతూ వీరు తమదైన ముద్ర వేసుకుంటున్నారు. మహిళా బిల్లుపై తమ పార్టీ అభిప్రాయాన్ని ఎంపీ గీత స్పష్టంగా చెప్పారు.

మహిళాలోకం కల సాకారం



చారిత్రక నిర్ణయం. మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి సాధించినప్పటికీ రాజకీయాల్లో ఆ స్థాయిలో రాణించలేకపోయారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ద్వారా మహిళలకు రాజకీయంగా కూడా ఆధిపత్యం లభిస్తుంది. ఎన్నో ఏళ్లుగా మహిళా లోకం ఎదురుచూస్తున్న కల సాకారం అవుతోంది. చాలా సంతోషంగా ఉంది. ఇప్పటికే మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతిగా అనేక నిర్ణయాలు తీసుకున్నారు. నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇచ్చారు. బిల్లు ఆమోదానికి అన్ని పార్టీలు రాజకీయాలకతీతంగా మద్దతు ఇవ్వడం శుభపరిణామం.

– వంగా గీత కాకినాడ ఎంపీ

మహిళలకు సముచిత స్థానం



మహిళ బిల్లుతో చట్టసభల్లో మహిళలకు సముచిత స్థానం లభిస్తుంది. 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే నిర్ణయం శుభ పరిణామం. ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు. ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థానిక సంస్థల పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేశారు. మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీల్లో 61 శాతం మంది మహిళలకు పదవులు కేటాయించి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారు. నామినేటెడ్ పదవుల్లోనూ జగనన్న ప్రభుత్వం సగటు రిజర్వేషన్‌ను అమలు చేస్తూ చట్టం చేసింది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక దళిత మహిళకు హోం మంత్రి పదవి కేటాయించారు. మహిళా బిల్లుకు మా పార్టీ సంపూర్ణ మద్దతు తెలిపింది.

– హోం మంత్రి తానేటి వనిత

చాలా సంతోషంగా ఉంది



పార్లమెంట్‌లో మహిళా బిల్లు ఆమోదం పొందడం చాలా సంతోషం కలిగించింది. 27 ఏళ్ల పాటు మహిళా బిల్లు కోసం యావత్తు దేశం ఎదురుచూసింది. మహిళా సాధికారతకు 33 శాతం రిజర్వేషన్లు అవసరమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎంతో పోరాటం చేశారు. గతంలో రాజ్యసభలో ఆమోదం పొందింది. ఇప్పుడు ఉభయ సభల్లో బిల్లు పాస్ కావడం మంచి పరిణామం. మహిళా బిల్లు ఆమోదం పొందాలని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎప్పటి నుంచో గట్టి ప్రయత్నం చేసింది. ఇంత కాలానికి బిల్లు వివిధ దశలను అధిగమించి ఆమోదం పొందిన సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఏపీలో ఆయన సారథ్యంలో మహిళలకు నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు.

– చింతా అనురాధ, అమలాపురం ఎంపీ

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రాతినిధ్యం ఇలా					
	1983- 01	1989- నిల్	1999- 03	2009- 02	2019- 02
	1985- నిల్	1994- నిల్	2004- 01	2014- 02	

క్షేత్ర సందర్శనకు అభ్యుదయ పాడి రైతులు



విజయరెడ్డి ఆధ్వర్యంలో అమలాపురం నుంచి వెళుతున్న రైతులు

అమలాపురం రూరల్ : జాతీయ పశుగణ మిషన్ సౌజన్యంతో అభ్యుదయ పాడి రైతుల క్షేత్ర సందర్శన కోసం కోనసీమ జిల్లా నుంచి 20 మంది విశాఖ జిల్లా పాయకరావుపేట వెళ్లారు. వారు అక్కడ శ్రీప్రకాష్ డైరీలో శిక్షణ తీసుకుంటారు. అమలాపురం సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి ఆధ్వర్యంలో పాడి రైతులను పంపినట్టు ఉపసంచాలకులు డాక్టర్ కర్నేడి మూర్తి గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు పాడి పోషణపై అవగాహన కల్పించడం, సాంకేతిక పద్ధతుల్లో పాడి పరిశ్రమ నిర్వహణ, అధిక పాల దిగుబడికి అనుసరించే విధానాలను తెలిపేందుకు రైతులను తీసుకువెళ్తున్నట్లు తెలిపారు. రాజమహేంద్రవరం నుంచి 20 మంది, కాకినాడ నుంచి ప్రాంతీయ పశుసంవర్ధక శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో మరో 20 మంది రైతులను అక్కడకు పంపుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమం నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ సౌజన్యంతో జరుగుతున్నట్లు డాక్టర్ వరప్రసాద్ తెలిపారు.

ఆరోగ్య జీవన విధానంపై అవగాహన

కలెక్టర్ హిమాన్షు శుక్లా




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శుక్లా, జేసీ నూపుర్

సాక్షి అమలాపురం: ఆరోగ్య జీవన విధానంపై ప్రజలకు అవగాహన పెంపొందించాలని, ఇందుకు ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీలు, వలంటీర్లు గృహ సందర్శన సమయంలో దృష్టి సారించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శుక్లాతోపాటు అధికారులు పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన, పాఠశాల విద్య, జగనన్న కాలనీలో ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటు, వాటర్ కనెక్షన్లు, గ్రామ, వార్డు సచివాలయ స్పందన, గడప గడపకూ మన ప్రభుత్వం, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు. అనంతరం స్థానిక అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖల కన్వర్జెన్సీతో పోషకాహార లోపాలు, రక్తహీనతతో ఉన్న బాలింతలు, గర్భిణులు, చిన్నారులను గుర్తించి స్క్రీనింగ్ నిర్వహించాలన్నారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లల్లో ఎదుగుదల లోపాలను గుర్తించి సరిచేస్తూ ప్రాథమిక విద్య నేర్పించాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నూపుర్ అజయ్, సీపీవో వెంకటేశ్వరులు, గ్రామ, వార్డు సచివాలయం నోడల్ అధికారి కె.భీమేశ్వరరావు, హౌసింగ్ పీడీ సీహెచ్ బాబురావు, డ్వామా పీడీ ఎస్.మధుసూదనరావు, డీపీవో వి.కృష్ణకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి ఎ.బోసుబాబు, డీఎంఅండ్‌హెచ్‌వో ఎం.దుర్గారావుదొర, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ ఎన్వీ కృష్ణారెడ్డి, డీఈవో ఎం.కమలకుమారి, డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర్ ప్రసాద్ పాల్గొన్నారు.

వేగంగా రీ సర్వే

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష రీ సర్వేకు సంబంధించి రెండో దశ గ్రామాలలో సరిహద్దు రాళ్ల ఏర్పాటు ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నూపుర్ అజయ్ సర్వే అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి.సాయిప్రసాద్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఇంతియాజ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జేసీతోపాటు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో రీ సర్వే జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. తుది దశలో భూ యజమాని పేరిట భూ హక్కుపత్రాల పంపిణీ, రెండో దశ సర్వేలో స్టోన్ ప్లాంటేషన్ పురోగతి, మూడో దశ సర్వేలో వారాంతపు లక్ష్యాలు, లక్ష్యసాధన, అసైన్‌మెంట్ భూముల విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేసీ జిల్లా అధికారులతో మాట్లాడుతూ రీ సర్వే వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలన్నారు. స్టోన్‌ప్లాంటేషన్ ప్రక్రియ ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వేకి సంబంధించిన ప్రతి అంశంపై పూర్తి అవగాహనతో ముందుకు వెళ్లాలని ఆమె సూచించారు. భూ రికార్డుల స్వచ్ఛీకరణ, డిజిటల్ ల్యాండ్ రికార్డుల నిర్వహణ ప్రక్రియలలో సమర్థవంతమైన నిర్వహణ చేపట్టాలని జేసీ స్పష్టం చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు కె.ప్రభాకరరావు, సెక్షన్ సూపరింటెండెంట్ రమణకుమారి పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం రూ.81.56 లక్షలు



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి హుండీలను గురువారం లెక్కించగా రూ.81,56,398 ఆదాయం వచ్చినట్లు ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. 30 రోజులకు ప్రధాన హుండీల నుంచి రూ.61,75,263, అన్న ప్రసాదం హుండీల నుంచి రూ. 19,81,135 అదాయం వచ్చినట్లు తెలిపారు. బంగారం 16 గ్రాములు, వెండి 635 గ్రాములు వచ్చినట్లు వివరించారు. పలు దేశాల విదేశీ కరెన్సీ వచ్చింది. విదేశీ కరెన్సీ యూఎస్‌డీ–1, ఓమెన్‌రైల్–1 (100) వచ్చింది. ఆలయ క్షేత్ర పాలకుడు శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ హుండీలను 30 రోజులకు లెక్కించగా రూ.2,07,472 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమం ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, అప్పనపల్లి శ్రీబాలబాలాజీ దేవస్థానం ఆలయ ఈఓ గ్రంధి మాధవి, రాజమహేంద్రవరం తనిఖీదారు గుర్రం సత్యవరప్రసాద్, మండపేట గ్రూప్ టెంపుల్స్ ఈఓ పీవీవీ కామేశ్వరరావు పర్యవేక్షణలో జరిగింది.

29న సీఎం జగన్ కాకినాడ పర్యటన

- వైఎస్సార్ వాహనమిత్ర ఐదో విడత సాయం విడుదల
- పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ




సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొనే సభా ప్రాంగణాన్ని అధికారులతో కలసి పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: కాకినాడలో వైఎస్సార్ వాహన మిత్ర పథకం ఐదో విడత లబ్ధి విడుదల కార్యక్రమం జరగనుంది. ఈనెల 29న జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాల్గొననున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రి కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్, రోడ్డు రవాణా, గ్రామీణ అభివృద్ధి, మెప్మా, పౌరసరఫరాలు తదితర శాఖల అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి జిల్లాలో సచివాలయాల వారిగా లబ్ధిదారుల తరలింపు, ఆటో, టాక్సీ డ్రైవర్స్ యూనియన్లతో సమావేశాలు నిర్వహణ, సభా వేదిక, రూట్ మ్యాప్, భోజనం ఏర్పాట్లు వంటి అంశాలపై కలెక్టర్ చర్చించారు. స్థానిక రంగరాయ వైద్యకళాశాల క్రీడామైదానంలో సభా వేదిక ఏర్పాటు చేస్తామన్నారు. తక్కువ సమయం ఉన్నందున అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలన్నారు. స్వయం సహాయక సంఘాలు, ఆటో, టాక్సీ యూనియన్ల సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2019 నుంచి వైఎస్సార్ వాహన మిత్ర పథకం అమలు చేస్తోంది.అర్హులైన టాక్సీ, ఆటో డ్రైవర్లు, యజమానులకు ఏటా రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందిస్తోందని కలెక్టర్ వివరించారు. సమావేశంలో డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డి, కాకినాడ నగర కమిషనర్ నాగ నరసింహారావు, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ డి పుష్పమణి, ఆర్డీవో పీవీ సాయి ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ కె శ్రీరమణి, డ్వామాపీడీ ఎ వెంకటలక్ష్మి, మెప్మా పీడీ బి ప్రియంవద, కాకినాడ పెద్దాపురం ఆర్డీవోలు ఎస్‌వీవీ సత్యనారాయణ, జె సీతారామారావు, డీఎల్డీవోలు, మున్సిపాలిటీ కమిషనర్లు, మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఏపీఎంలు పాల్గొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో తొలుత కలెక్టర్ కృతికా శుక్లా, జిల్లా ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలిసి పోలీస్ పెరేడ్ మైదానం, రంగరాయ వైద్య కళాశాల క్రీడామైదానం, జిల్లా క్రీడా మైదానాలను పరిశీలించారు.

ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్‌తోనే కొనుగోలు

- కొబ్బరి విక్రయించిన వారంలోగా ఖాతాల్లో సొమ్ము జమ
- ఏపీ ఆయిల్ ఫెడ్ మేనేజర్ సుధాకరరావు



అంబాజీపేటలో ఆరబెట్టిన ఎండు కొబ్బరి (ఫైల్)

అంబాజీపేట: నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రంలో కొబ్బరిని విక్రయించే రైతుల వివరాలను ఆయా గ్రామాల్లో ఉన్న ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏపీ ఆయిల్ ఫెడ్ మేనేజర్ యు.సుధాకరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రకటనలో వివరించారు. ఆర్బీకేల్లో నమోదు చేసుకున్న రైతుల వద్ద నుంచి మాత్రమే కొబ్బరిని కొనుగోలు చేస్తామన్నారు. రైతుల వద్ద తయారైన కొబ్బరి సిద్ధంగా ఉంటే అంబాజీపేటలో ఏర్పాటు చేసిన నాఫెడ్ కేంద్రంలో కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఆర్బీకేల్లో నమోదు చేసుకున్న రిజిస్ట్రేషన్ ఫారమ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. కొబ్బరిని తయారు చేసే కళ్లాల్లో ఉండగానే కొబ్బరిని పరిశీలించి నాఫెడ్ కేంద్రానికి తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అయితే ప్రభుత్వ నిబంధనల మేరకు కొబ్బరి తేమ శాతం, దుమ్ము ధూళి తదితర అంశాలను రైతులు పాటించాల్సి ఉందన్నారు. మిల్లింగ్ కోప్రాకు రూ.10,860, బాల్ కోప్రాకు రూ.11,750 మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కొబ్బరిని విక్రయించిన వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు.

ఇవీ నిబంధనలు

- రద్దు, దుమ్ము, ధూళి, పెంకు వగైరా ఒక శాతం కన్నా ఎక్కువ ఉండకూడదు.
- ముడతలు ఏర్పడిన కొబ్బరి చిప్పలు 10 శాతం ఎక్కువగా ఉండకూడదు.
- పగిలిన చిప్పలు 10 శాతం కన్నా ఎక్కువ ఉండకూడదు.
- 6 శాతం తేమ కన్నా ఎక్కువ ఉండకూడదు.
- నెలకోసారి ఎకరాకు రెండు బస్తాల కొబ్బరి కొనుగోలు
- ఆయిల్, నాఫెడ్ అధికారుల పర్యవేక్షణలోనే కొనుగోళ్లు
- కొబ్బరి పంట దిగుబడిపై రైతులకు విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్‌లు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి.
- రైతుల వివరాలతో పాటు, కొబ్బరి విక్రయాలకు సంబంధించి కంటిన్యూస్ మోనటరింగ్ ఆఫ్ అగ్రికల్చర్ ప్రైసెస్ అండ్ ప్రొక్యూర్‌మెంట్ (సీఎం యాప్)లో నమోదు చేస్తారు.
- ఒరిజినల్ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంక్ అకౌంట్ నంబరు ఇవ్వాలి.
- సీఎం యాప్ ద్వారానే రైతులకు ఆన్‌లైన్‌లో నగదు వారి ఖాతాలో జమ
- దళారీలు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులు నేరుగా నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలి.
- కొనుగోలు కేంద్రాలు సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పనిచేస్తాయి.

క్లుప్తంగా

పంచలోహ విగ్రహం చోరీ నిందితుడి అరెస్ట్


చోరీ వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రమణ

రాజోలు: సోంపల్లి వినాయక మంటపంలో చోరీకి పాల్పడిన అదే గ్రామానికి చెందిన కామాడి నాగరాజును గురువారం రాజోలు పోలీసులు అరెస్ట్ చేశారు. కొత్తపేట డీఎస్పీ కె.వి.రమణ రాజోలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో విలేకరులకు వివరాలు తెలిపారు. వినాయక మంటపంలో ఏర్పాటు చేసిన పంచలోహ విగ్రహం, రాగి కలశాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 18వ తేదీ రాత్రి నాగరాజు మద్యం సేవించి వినాయకుని మంటపంలో ఉన్న పంచలోహ వినాయకుని విగ్రహం, కలశాన్ని చోరీ చేశాడు. ఈ ప్రయత్నంలో మంటపంలో ఉన్న 10 అడుగుల వినాయకుని విగ్రహం ఎడమ చేతిని, తొండం ధ్వంసం చేశాడు. 24 గంటల్లో చోరీ చేసిన వ్యక్తిని పట్టుకున్న రాజోలు సీఐ గోవిందరాజు, ఎస్సై పృథ్వీలను డీఎస్పీ అభినందించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తుని: తుని గవర్నమెంట్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో నర్సీపట్నం రోడ్డు–రేగుపాలెం మధ్యలో రైలు నుంచి జారిపడి 44 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. గురువారం అందిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తుని నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. తెలుపు రంగు ఫుల్ చేతుల చొక్కా, సిమెంట్ రంగు జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడని, మృతుడి వివరాలు తెలియలేదన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మారూఫ్ తెలిపారు.

ఎలుకల దాడికి చెక్

- ఖరీఫ్, రబీలో రైతులకు తప్పని సమస్య
- వరి దుబ్బులను కొరికేయడంతో తీవ్ర నష్టం
- నేడు సామూహిక నివారణకు వ్యవసాయ శాఖ సన్నద్ధం



కొత్తపేట: వ్యవసాయ, ఉద్యాన పంటలకు ఎలుకల బెడదతో తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ముఖ్యంగా వరిపై ఖరీఫ్, రబీ సీజన్‌లలో ఎలుకలు దాడి చేసి నష్టపరుస్తున్నాయి. వరి పంట ఆకుమడి దశ నుంచి మాసూళ్ల వరకూ రైతులకు ఈ సమస్య తప్పడం లేదు. వరి పంట దుబ్బు చేసి, పిలకలు వేసే దశలో ఎలుకలు వలన కలిగే నష్టం ఎక్కువగా ఉంటుంది. దీంతో రైతులు మూషికాల మూలంగా నష్టపోతున్నారు. పూర్వం నుంచి రైతులు ఎలుకల నిర్మూలనకు బుట్టలు పెట్టించేవారు. ఎలుకల బొరియల్లో పొగ పెట్టించి కూడా వాటిని అరికట్టేవారు. ఈ రెండు విధానాలు అధిక ఖర్చుతో కూడుకున్నవి. ఒక్కో ఎలుకను నివారించేందుకు రూ.60 నుంచి రూ.100 ఖర్చు అవుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో బ్రొమోడయోలోన్ ఎర ద్వారానే ఎలుకలను సులభంగా అరికట్టవచ్చని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ విధానంలో ఎలుకలను సమర్థవంతంగా అరికట్టాలంటే రైతులందరూ సామూహికంగా ఎలుకల నిర్మూలన చర్యలు చేపట్టడం ద్వారానే సాధ్యమని వ్యవసాయ శాఖ పిలుపునిచ్చింది. ఖరీఫ్, రబీ సీజన్‌లలో క్రమం తప్పకుండా ప్రణాళికాబద్ధంగా సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అధికారులు సూచిస్తున్నారు. ఆ మేరకు వ్యవసాయ శాఖ ఉన్నత స్థాయి అధికారుల నుంచి క్షేత్ర స్థాయి సిబ్బంది వరకూ రైతులను చైతన్యవంతులను చేసి ఎలుకలపై సామూహిక దాడికి సమాయత్తమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు శుక్రవారం ఈ సామూహిక కార్యక్రమానికి రంగం సిద్ధం చేసినట్టు వ్యవసాయ అధికారులు తెలిపారు.

ఎలుకల ఉనికి గుర్తింపు–నివారణ చర్యలు

ఎలుకలు సంచరిస్తుంటే పొలం గట్లపై బొరియలు ఉంటాయి. పొలంలో ఎలుకలు కొరికేసిన వరి పిలకలు, దుబ్బులు కనిపిస్తాయి. మట్టిలో ఎలుకల పాదముద్రలు కనిపిస్తాయి. ఇలా ఎలుకల ఉనికిని సులభంగా గుర్తించవచ్చు. ఎలుకల నివారణకు ముందుగా పొలం గట్లపై కలుపు మొక్కలు తొలగించి శుభ్రం చేయాలి. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా బ్రొమోడయోలిన్ అనే ఎరను రైతులకు ఉచితంగా సరఫరా చేస్తోంది. రైతులు ఈ మందును తెచ్చుకుని ఎలుకలను నివారించుకోవచ్చు.

842 కేజీల బ్రొమోడయోలిన్ మందు సరఫరా

జిల్లాలో ఏడు వ్యవసాయ సబ్ డివిజన్ల ద్వారా 22 మండలాల పరిధిలోని 415 గ్రామాల్లో 1.83 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేస్తున్నారు. సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం సందర్భంగా వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం జిల్లాకు 842 కేజీల బ్రొమోడయోలిన్ మందు సరఫరా చేసింది.

ఎరను ఇలా తయారుచేయాలి..

20 గ్రాముల బ్రొమోడయోలోన్ మందు, 960 గ్రాముల నూకలు, 20 గ్రాముల నూనె కలిపి 1,000 గ్రాముల ఎలుకల ఎరను తయారు చేయాలి. ఈ ఎరను 100 ఎలుకల బొరియలకు సరిపోతుంది. 10 గ్రాములు చొప్పున 100 పొట్లాలను కట్టాలి. మొదటి రోజు ఎలుకల బొరియలను గుర్తించి మట్టితో కప్పేయాలి. రెండో రోజు మట్టితో కప్పేసిన బొరియలో ఎలుక ఉంటే ఆ బొరియ తెరుచుకుని ఉంటుంది. ఆ ఎలుకల బొరియల్లో ఎర పొట్లాలు పెట్టాలి. దీంతో ఆ ఎరను తిన్న ఎలుకలు చనిపోతాయి.


చేల గట్లపై ఎలుక బొరియలు గుర్తిస్తున్న వ్యవసాయ సిబ్బంది, రైతులు

వ్యవసాయ కమిషనరేట్ నుంచి జిల్లాకు ప్రత్యేక పరిశీలకుడు

సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించి ప్రభుత్వం వ్యవసాయ కమిషనరేట్‌కు చెందిన ఆర్‌బీకే విభాగం డీడీఏ డి.వెంకటేశ్వర్లును జిల్లా పరిశీలకునిగా నియమించింది. శుక్రవారం ఆయన ఒక్కో వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఒకటి, రెండు గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారు. కొత్తపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఈతకోట, మెర్లపాలెం, ఆలమూరు సబ్ డివిజన్‌లో పెదపళ్ల, రామచంద్రపురం సబ డివిజన్‌లో వెల్ల, అమలాపురం సబ్ డివిజన్‌లో సిరిపెల్ల, పి.గన్నవరం సబ్ డివిజన్‌లో గంగలకుర్రు, రాజోలు సబ్ డివిజన్‌లో గూడపల్లి గ్రామాల్లో పర్యటిస్తారు.

సామూహికంగా ఎలుకల నిర్మూలనకు కార్యాచరణ



ఖరీఫ్‌లో ఎలుకల బెడద ఎక్కువగా ఉంటుంది. ఎవరికి వారు ఎలుకలను నివారించే విధానం వలన పూర్తిగా నిర్మూలించడం సాధ్యం కాదు. సామూహికంగా బ్రొమోడయోలిన్ మందు ఎరను బొరియల్లో పెట్టడం ద్వారా మాత్రమే ఎలుకలను సమర్థంగా నిర్మూలించగలం. అందుకు ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా బ్రొమోడయోలిన్ మందు సరఫరా చేసింది. అందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశాం. దానిలో భాగంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా మందును రైతులకు ఉచితంగా అందచేసి, ఎర తయారు, సామూహికంగా ఎలుకల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్నాం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రైతులు ఎలుకల బారి నుంచి పంటను రక్షించుకోవాలి.

– బి.బోసుబాబు, జిల్లా వ్యవసాయ అధికారి, అమలాపురం

రూ.3.01 లక్షలు పలికిన వినాయకుడు


చివటంలో నెలకొల్పిన వినాయకుడు

ఉండ్రాజవరం: వేలం పాటలో వినాయకుడి మట్టి విగ్రహానికి మూడు లక్షల ఒక వేయి రూపాయల ధర పలికింది. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని చివటం గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మట్టి విగ్రహానికి బుధవారం రాత్రి వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో రూ.3.01 లక్షలకు గ్రామానికి చెందిన సింహాద్రి వెంకటలక్ష్మి విగ్రహాన్ని దక్కించుకున్నట్లు చివటం వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు గురువారం తెలిపారు. 21 మంది డిపాజిట్ కట్టి ఈ వేలంలో పాల్గొనగా ముగ్గురి మధ్య పోటాపోటీగా పాట జరిగింది. వినాయక చవితి ఉత్సవాల్లో సహజంగా లడ్డూ ప్రసాదానికి వేలం పెడతారు. కాని చివటంలో మాత్రం విగ్రహానికి వేలం నిర్వహిస్తారు. అలా వేలంలో విగ్రహాన్ని దక్కించుకున్న వారు ఐదు రోజులు గ్రామంలో మేళ తాళాలు, విచిత్ర వేషధారణలతో ఊరేగించి తమ వ్యవసాయ భూముల్లో గాని, భూమి లేని వారు తమ ఇళ్లల్లోని బావుల్లో నిమజ్జనం చేసుకుంటారు. అలా చేయడం వలన వారి పాడి పంటలు సంవృద్ధిగా పండి, కోరికలు తీరుతాయని గ్రామస్తులకు నమ్మకం. 70 సంవత్సరాలుగా ఇదే ఆనవాయితీ కొనసాగుతోందని కమిటీ సభ్యులు తెలిపారు.

వ్యాన్, ట్రావెల్ బస్సు ఢీ

- వ్యాన్ డ్రైవర్ మృతి
- ముగ్గురికి తీవ్ర గాయాలు

దేవరపల్లి: తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యర్నగూడెం గండిచెరువు మలుపు వద్ద గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. యర్నగూడెం నుంచి నల్లజర్ల కోళ్లు తీసుకురావడానికి వెళుతున్న వ్యాన్‌ను ఎదురుగా వేగంగా హైదరాబాద్ నుంచి కాకినాడ వెళుతున్న ప్రయివేటు ట్రావెల్స్ బస్సు ఢీ కొంది. అనంతరం బైక్‌పై వెళుతున్న ఇద్దరు వ్యక్తులను బస్సు అదుపుతప్పి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న యర్నగూడెంకు చెందిన కొల్లి యశ్వంత్, డ్రైవర్ కోతాడ కనకపెద్దిరాజు(33), బైక్‌పై వెళుతున్న బొడ్డు చంటి, జెర్రి నాగేంద్ర తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను గోపాలపురం ఏరియా అసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. అక్కడ పెద్దిరాజును పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్టు నిర్ధారించారు. మిగిలిన ముగ్గురిని రాజమహేంద్రవరం ఆసుపతికి తరలించినట్టు ఎస్సై కె. శ్రీహరిరావు తెలిపారు. బస్సులో 23 మంది ప్రయాణికులు ఉండగా అందరూ క్షేమంగా ఉన్నట్టు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.


వ్యాన్‌ను ఢీ కొన్న ప్రయివేటు ట్రావెల్ బస్సు


కనక పెద్దిరాజు మృతదేహం

పొగాకులో హానికర పదార్థాలు తగ్గేలా పరిశోధనలు

ఐసీఏఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ యాదవ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పొగాకులో హానికరమైన పదార్థాలు తగ్గించే విధంగా పరిశోధన జరగాలని న్యూఢిల్లీ భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ (సీడ్స్) డాక్టర్ డీకే యాదవ్ అన్నారు. గురువారం స్థానిక సీటీఆర్ఐ సెమినార్ హాల్లో 26వ అఖిలభారత పొగాకు నెట్‌వర్క్ ప్రాజెక్టు వర్కుషాప్ సీటీఆర్ఐ డైరెక్టర్, ఏఐఎన్‌పీటీ ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అధ్యక్షతన జరిగింది. ఈ వర్కుషాప్‌లో ఆన్‌లైన్‌లో యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పొగాకులో ముఖ్యంగా చూయింగ్, పొగ రకాలలో నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేసే దిశగా శాస్త్రవేత్తలు తమ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. పొగాకు సాగులో యాంత్రీకరణకు ప్రాధాన్యం ఇస్తూ అధిక దిగుబడులు సాధిస్తూ సాగు ఖర్చును తగ్గించుకోవాలని వివరించారు. సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎం.శేషుమాధవ్ సీటీఆర్ఐ, ఏఐఎన్‌పీటీ కేంద్రాలు సాధించిన పరిశోధన ఫలితాలను వివరించారు. సీటీఆర్ఐ పూర్వపు డైరెక్టర్ డాక్టర్ టీజేకే మూర్తి మాట్లాడుతూ పొగాకు జెర్మ్ ప్లాస్మ్ సంరక్షణలో బ్రీడర్స్ పాత్ర ముఖ్యమైందన్నారు. ఏఐఎన్‌పీటీ కేంద్రాల అభివృద్ధికి ఎక్కువగా కృషి చేయాలని సూచించారు. సీటీఆర్ఐ డివిజన్ ఆఫ్ క్రాప్ ప్రొటెక్షన్ హెడ్, మాజీ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ యు.శ్రీధర్ మాట్లాడుతూ ఏఐఎన్‌పీటీ ద్వారా విడుదలయిన 5 పొగాకు వంగడాలు అత్యధిక దిగుబడులు సాధిస్తూ రైతుల మన్ననలు పొందాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని వంగడాలు ఏఐఎన్‌పీటీ కేంద్రాల ద్వారా అభివృద్ధి జరగాలని కోరారు. సీటీఆర్ఐ కెమిస్ట్రీ అండ్ సాయిల్ సైన్సెస్ డివిజన్ హెడ్, మాజీ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సి.చంద్రశేఖరరావు మాట్లాడుతూ దిగుబడుల సమతుల్యత లోపించినపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు సూచించారు. ఏఐఎన్‌పీటీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె.సరళ గత సంవత్సరపు సూచనలు, వాటి పరిశోధన ఫలితాలు వివరించారు. అనంతరం ఏఐఎన్‌పీటీ యాన్యువల్ రిపోర్ట్ 2022–23, టుబాకో రీసెర్చ్ జర్నల్ జూన్ 2023, సీటీఆర్ఐ న్యూస్‌లెటర్ జనవరి అండ్ జూన్ 2023 సాంకేతిక ప్రచురణలను విడుదల చేశారు. నాలుగు సాంకేతిక విభాగాల ప్రధాన అధిపతులు, ఏఐఎన్‌పీటీ 14 కేంద్రాల పరిశోధన ఫలితాలను శాస్త్రవేత్తలు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలిపారు. టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.శ్రీధర్‌బాబు, ఐసీఏఆర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రేణు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. ఏఐఎన్‌పీటీ 14 కేంద్రాల నుంచి శాస్త్రవేత్తలు, సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు, ట్రేడ్, స్టేట్ అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో సాంకేతిక ప్రచురణలను విడుదల చేస్తున్న సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్ తదితరులు

దొంగతనం కేసులో 11 నెలల జైలు

రావులపాలెం: మోటార్ సైకిళ్లను దొంగిలించిన రెండు వేర్వేరు కేసుల్లో పట్టుబడిన నిందితుడికి కొత్తపేట జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు 11 నెలలు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై ఎం.వెంకటరమణ గురువారం తెలిపారు. 2022 సంవత్సరంలో రావులపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో మోటార్ సైకిళ్లను దొంగతనం చేసి పట్టుబడిన రెండు కేసుల్లో విశాఖపట్నం జిల్లా నెల్లిముక్కల గ్రామానికి చెందిన గొల్లంకి నాగ లక్ష్మీనారాయణను అరెస్ట్ చేసి కోర్టులో హాజరపరచగా విచారణ అనంతరం జడ్జి ఎం.భాస్కరరావు 11 నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరప: అనారోగ్య బాధను తాళలేక ఆత్మహత్యకు పాల్పడిన ఒక వ్యక్తి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కరప మండలం వాకాడ గ్రామానికి చెందిన అడబాల వీరభద్రరావు వ్యవసాయం చేస్తుంటాడు. అతనికి ఇద్దరు కుమారులు. ఏడాదిన్నర క్రితం కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకున్నాడు. అయినా బాధ తగ్గకపోవడంతో వైద్యం చేయించుకుంటున్నాడు. ఈ నెల 20వ తేదీన బాధ ఎక్కువవడంతో జీవితంపై విరక్తి చెందిన వీరభద్రరావు పొలంలోకి వెళ్లి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటికి వచ్చి పురుగుమందు తాగినట్టు చిన్నకొడుకు రెడ్డియ్యకు చెప్పడంతో కొడుకులు ఇద్దరూ చికిత్స కోసం తండ్రిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కరప ఏఎస్ఐ వి.సూరిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్టు

మామిడికుదురు: పాశర్లపూడిబాడవ పల్లవపాలానికి చెందిన కొల్లు సాయికుమార్‌ను హత్య చేసిన కేసులో అతని భార్య కొల్లు రాజేశ్వరి, ప్రియుడు కొల్లు వెంకటేష్‌ను గురువారం అరెస్టు చేశామని పి.గన్నవరం సీఐ ప్రశాంత్‌కుమార్, నగరం ఎస్సై పి.సురేష్ గురువారం తెలిపారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో కొల్లు సాయికుమార్ (24)ను అతని భార్య రాజేశ్వరి, ప్రియుడు వెంకటేష్ ఈ నెల 17వ తేదీన హత్య చేశారు. అయిదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్న సాయికుమార్‌కు ఇద్దరు ఆడ పిల్లలు. సాయికుమార్ ఇంటి సీలింగ్ పనులు నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. రాజేశ్వరితో కొన్నాళ్లపాటు సంసారం సాఫీగా జరిగింది. అనంతరం అదే గ్రామానికి చెందిన కొల్లు వెంకటేష్‌తో హతుడి భార్య రాజేశ్వరి వివాహేతర సంబంధం పెట్టుకుంది. వారిద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17వ తేదీ రాత్రి సాయికుమార్ మద్యం మత్తులో ఉండగా వెంకటేష్ సహకారంతో భార్య గొంతు నులిమి చంపేసింది. తన కుమారుడి మృతికి అతని భార్య రాజేశ్వరి, ప్రియుడు వెంకటేష్ కారణమని హతుడి తండ్రి కొల్లు వీరపండు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరం పోలీసులు హత్య కేసు నమోదు చేసి విచారణ నిర్వహించి నిందితులను అరెస్టు చేశారు.

విశ్వకవి గురజాడ


అరసం ఆధ్వర్యంలో గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కర్రి రామారెడ్డి తదితరులు

సీటీఆర్ఐ: ఆధునిక తెలుగు సాహిత్యంలో సంఘసంస్కర్తగా తన గొంతు ఎత్తి, కాలాన్ని ఆయుధంగా మలచిన కవనయోధుడు గురజాడని నన్నయ్య విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ తరపట్ల సత్యనారాయణ అన్నారు. ఎస్కేవీటీ ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ, కళా గౌతమి సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో గురజాడ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాడ రాసిన కన్యాశుల్కం, పూర్ణమ్మ, కన్యక, నీలగిరి పాటలు వంటి ఎన్నో రచనల్లో సంఘ సంస్కరణ దాగి ఉందని, అందుకే యువత గురజాడ రచనలను, గురజాడ జీవిత చరిత్రను అధ్యయనం చేయాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ పీటీబీ సంజీవరావు మాట్లాడుతూ సామాజిక చైతన్యాన్ని రగిలించే కవిత్వం రావాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏబెల్ రాజబాబు మాట్లాడుతూ, విద్యార్థులు కాలాన్ని సామాజిక సంస్కరణ కోసం వినియోగించాలని, అప్పుడే కందుకూరి, గురజాడ లాంటి సంఘ సంస్కర్తలు అడుగుజాడలో నిలుస్తారని తెలిపారు. అధ్యాపకులు ఎమ్మెస్ ఫణికుమార్, పల్లి సుధ, ఎస్.రాజ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంఘిక దురాచారాలను అరికట్టిన గురజాడ

మహాకవి గురజాడ తన రచనల ద్వారా సాంఘిక దురాచారాలను అరికట్టడంలో ప్రధాన పాత్ర పోషించారని తూర్పుగోదావరి జిల్లా అభ్యుదయ రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కర్రి రామారెడ్డి అన్నారు. గురువారం స్థానిక గోరక్షణపేటలో తూర్పుగోదావరి జిల్లా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో సంఘ కార్యాలయంలో మహాకవి గురజాడ అప్పారావు 161వ జయంత్యుత్సవం జరిగింది. డాక్టర్ రామారెడ్డి మాట్లాడుతూ ఇప్పుడు వరకట్నం దురాచారమైతే...అప్పటి రోజుల్లో కన్యాశుల్కం అనేది సాంఘిక దురాచారమని, కన్యాశుల్కం నాటకం రచన ద్వారా దాని అరికట్టడంలో గురజాడ ప్రధాన పాత్ర పోషించారని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన తూర్పుగోదావరి జిల్లా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) అధ్యక్షుడు పడాల వీరభద్రరావు మాట్లాడుతూ తెలుగు వాడుక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి సహాధ్యాయి అయిన గురజాడ ఆయనతో కలిసి తెలుగు వాడుక భాషా వ్యాప్తికి కృషి చేశారని అన్నారు.

తేలుకుట్టి బాలిక మృతి


చిన్నారి తబిత (ఫైల్)

కాకినాడ క్రైం/గోకవరం: తేలు కుట్టి అన్నెం పున్నెం తెలియని ఓ బాలిక మృత్యువాత పడింది. గోకవరం మండలం రంప ఎర్రంపాలెం గ్రామానికి చెందిన నూకతట్టు తబిత(6) స్థానిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. బుధవారం ఇంటి ఆవరణలో ఆడుకుంటూండగా కాలిపై తేలు కుట్టింది. స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా పరిస్థితి మరింత విషమించడంతో వారు కాకినాడ జీజీహెచ్‌కు సిఫారసు చేశారు. జీజీహెచ్‌లో చేర్చగా చికిత్స పొందుతూ గురువారం తబిత మృతి చెందింది. శ్రీను, ప్రశాంతి దంపతుల ముగ్గురు కుమార్తెల్లో తబిత రెండవ సంతానం. అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమార్తె కళ్ల ముందే తేలు కాటుకి బలైపోవడంతో తల్లిదండ్రులు జీజీహెచ్ ఆవరణలో గుండెలవిసేలా రోదించారు.

పోలవరం కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గండేపల్లి: మండల పరిధి గండేపల్లి శివారు మురారికి సమీపంలో గల పోలవరం కాలువలో పైనుంచి కొట్టుకు వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికుల సమాచారంతో గురువారం స్వాధీనం చేసుకున్నట్టు గండేపల్లి ఏఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. మృతుని వయస్సు 50 నుంచి 60 వరకు ఉంటుందని, ఐదు అడుగుల ఎత్తు కలిగి శరీరంపై లేత గులాబీ రంగు చొక్కా, గడులతో ఉన్న నిక్కర్ ధరించి ఉన్నాడని, మృతుని శరీరంపై ఎటువంటి గాయాలు లేకపోవడంతో సుమారు మూడు రోజుల క్రితం ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహం పాడై దుర్వాసన వస్తోందని, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంచినట్టు పేర్కొన్నారు. వివరాలు తెలిస్తే గండేపల్లి పోలీస్ స్టేషన్ 08852 294100, 94409 04841 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.